విన్నాక-మీ ముగ్గురూ నా దృష్టికి అద్భుతంగా-మానవాతీతంగా అనిపించారు-అంతేకాదు. దేముడికి పూజచేయబడిన - నిర్మాల్యంలాగ పరమ పవిత్రంగా అనిపిస్తున్నారు...."

వంశీ ముఖంలోని ఒక్కసారి కళ వొచ్చింది.

అతను ఆశగా రాధికవేపు చూశాడు.

రాధిక చిరునవ్వు నవ్వింది. ఇప్పుడామె ముఖం చాలా సందేహాలు తొలగి-ఒక మంచి నిర్ణయానికి వొచ్చినట్లు నిర్మలంగా....తేటగా ఉంది. ఆమె చూపులలో....మందహాసంలో....ప్రేమ నిండి ఉంది.

అక్కడి వాతావరణం తేలికై....ఆనంద వెల్లి వెరిసింది.


**తెల్లమచ్చలు**

మా మందు ఉపయోగించటంవల్ల తెల్లమచ్చలు సహజమైన రంగులోకి మూడు రోజుల్లో మారుతుంది. ఆర్డరు పంపిన వెంటనే ఒక సీసామందు ఉచితంగా ఇవ్వబడుతుంది. వ్యాధి పూర్తిగా నివారించబడుతుంది. మీ అడ్రస్ యింగ్లీషులోనే వ్రాయండి.

GAZETTED TREATMENT CENTRE (Y.V.)
P. O. KATRISARAI (GAYA)

**తెల్లవెంట్రుకలు నలుపు**

తెల్లవెంట్రుకలు మా ఆయుర్వేద రిజర్వ్ అయిల్‌తో కుదుళ్లనుండి నల్లబడతాయి. మనోవికాసము మరియు కళ్లు ప్రకాశవంతంగా ఉండేందుకు కూడా తోడ్పడుతుంది. ఫుల్ కోర్స్ రు॥ 45 పోస్టేజి అదనం. మీ అడ్రస్ యింగ్లీషులోనే వ్రాయండి.

RESERVE OIL COMPANY (Y.V.)
P. O. KATRISARAI (GAYA)


# రహస్యం



## సి.హెచ్.శాంతాదేవి

మాది చాలా అనుకూల దాంపత్యమని మా బంధుమిత్రులందరూ అనుకుంటుంటారు. నా మటుకు నాకూ అది నిజమే ననిపిస్తుంది. ఎవరైనా భార్యాభర్తల్ని చూపించి వారు చాలా అన్యోన్యంగా వుంటారంటే హాస్యాస్పదంగా వుంటుంది. వారి అన్యోన్యతలోని అసలు కిటుకు నాకు తెలుసుగాబట్టి.

"అబ్బే ఆ కిష్టిగాడు, వాడిపెళ్లాం అస్తమానం కీచులాడుకుంటూనే వుంటారు...." అని ఎవరైనా అంటే వారివేపు కుతూహలంగా చూస్తాను. ఇద్దరూ సమమైన వ్యక్తిత్వం గలవారయితేనే వారిలో అన్యోన్యత లోపించి నిత్యఘర్షణకి దారితీస్తుంది.

....నేనూ, మా ఆవిడా చాలా సుఖంగా బ్రతుకుతున్నాం. మా మధ్య ఎప్పుడూ పోట్లాటలు రావు. ఎందుకంటే నేను చాలా విషయాలు ఆవిడకే వదిలేస్తుంటాను. అది నాకు చాలా నిశ్చింతని కలుగచేస్తుంది. పిల్లల్ని ఏ స్కూల్లో చేర్పించాలి, బట్టలు ఎప్పుడెప్పుడు తీసుకోవాలి, బంధువుల్ని ఎప్పుడెప్పుడు పిలవాలో, మేం వూళ్ళకి ఎప్పుడెప్పుడు వెళ్ళాలో ఇవన్నీ ఆవిడే చూసుకుంటుంది. ఇంకా ఇంకా ఇంటికి సంబంధించిన చిల్లర మల్లర విషయాలన్నీ ఆవిడ ఆధీనంలోనే వుంటాయి....రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి

గురించి, కొత్త మంత్రిగారి ద్వారా మనకి లాభాలు ఎక్కువా, నష్టాలు ఎక్కువా ఇత్యాది విషయాలన్నీ నేను చర్చిస్తుంటాను. నేను ఈ పద్ధతి అమలు పరచటంవల్ల మా యిల్లు సుఖశాంతులతో తులతూగుతున్నట్టుగా వుంటుంది.

మా అమ్మా, నాన్నా అదోరకమైన మనుషులు. నేనూ, మా ఆవిడా అన్ని విషయాలు చర్చించుకోవటం వారికది మొదట్లో వింతగా వుండేది. రానురాను అలవాటయిపోయిందనుకోండి. ఇప్పుడు వాళ్ళుకూడా ప్రతి పనికీ కోడలి సలహా తీసుకోవటం మొదలెట్టారు. ఇంట్లో కేవలం నిమిత్తమాత్రుడిలా వుండటం నేర్చుకున్నాను.

"ఫలానా వారింట్లో పెళ్ళి, శుభలేఖతో పాటు ఉత్తరం కూడా వచ్చింది. వాళ్ళు మనకి చాలా కావల్సినవాళ్ళు...." అమ్మ ఈ సంగతి చెప్పగానే నేను ఏ నిర్ణయమూ తీసుకోలేదు. మా ఆవిడతో సంప్రదించాను.

కొంత అయిదు నిమిషాలు దీర్ఘంగా ఆలోచించింది.

తర్వాత పెదవి విరుస్తూ,

"మనకి పెళ్ళికి వెళ్ళటం అంత ముఖ్య మనిపించటంలేదండీ. గ్రీటింగ్స్ పంపించి, రాలేకపోయినందుకు బాధపడ వద్దని ఉత్తరం రాస్తే సరిపోతుంది. నా ఉద్దేశం మాత్రమే ఇది. తర్వాత మీ యిష్టమే అనుకోండి ...." అని పూర్కుంది.

నే నిక ఆ విషయం ఆలోచించలేదు.

"అబ్బాయి! దొడ్డిగోడ పడిపోయింది. పందులు, కుక్కలు మన దొడ్లోనే నివాసం ఏర్పరచుకుంటున్నాయి. దాని సంగతేదో చూడు నాయనా" అంది అమ్మ.

నిజమేననిపించింది నాకు. పూర్వం దొడ్డినిండా చెట్లు, ఏవేవో పాదులు వేస్తూండేది అమ్మ. ఇప్పుడు గోడ పడి పోవటంతో మేకలు యథేచ్ఛగా మా దొడ్లో పిరవిహారం చేస్తూ మొక్క లన్నీ ధ్వంసంచేస్తున్నాయి .... అమ్మ అన్నట్టు వెంటనే గోడ కట్టించాలి అనుకున్నాను .... కానీ మొదట్నించీ చూస్తున్నాను గదా! నేను అనుకున్నది అనుకున్నట్టు ఒక్కటీ జరగదు .... ఒకటీ, రెండూ అలా జరిగినా కొద్ది రోజులు మాయింట్లో సుఖశాంతులు కరువవుతాయి....అందువల్ల అసలా పరిస్థితే రాకుండా జాగ్రత్తపడుతుంటాను నేను.

ఆ రాత్రి పడుకోవటానికి గదిలో కొచ్చింది మా ఆవిడ.

"అమ్మ ఉత్తరం రాసిందండీ .... డైనింగ్ టేబిల్ కొన్నారట."

చదువుతున్న పేపరు మడుస్తూ, "అలాగా...." అన్నాను.

కొద్దిసేపు ఊర్కుని,

"మీకి నెలలో బోనస్ వస్తుందిగదా, ఏం చేద్దామనుకుంటున్నారు?" అంది ఆరాగా.





ఈ ఆడవాళ్ళకి ఇంటి విషయాలకన్నా బయటి విషయాలమీద ఆసక్తి మెండుగా ఉంటుంది.

ఆవిడ ఆ సంగతి గుర్తుచేసేదాకా అసలా డబ్బు ఏంచెయ్యాలా అన్న ఆలోచన రాలేదు నాకు.

కానీ ఆ శ్రమ నాకు లేకుండాచేసింది మా శ్రీమతి.

"మనం కూడా డైనింగ్ టేబుల్ కొందామండీ .... ఎప్పటికైనా కొనాల్సిందేగా!"

ఎప్పటికయినా కొనాల్సిందేనా? అవును గాబోలు....

"నే నీరోజే కార్డురాసి పడేశాను. మనకూ డా కావాలి, ఇంకో టేబుల్ కు ఆర్డరివ్వమని."

"అమ్మయ్య" అనుకున్నాను.

నాకు ఆలోచించే బాధ తప్పింది.

మా అమ్మ ఏదో అనబోయింది.

ఆవిడకి నచ్చచెప్పాను.

ఇంట్లో దొడ్డిగోడకన్నా, డైనింగ్ టేబిల్ అవసరం ఎంతవుందో, మా ఆవిడ నాకు చెప్పిన విషయాలకి నా వుద్దేశాలు మరికొన్ని జోడించి ఆవిడని ఒప్పించాను.

....పెళ్ళయిన కొత్తలో అలవాటు ప్రకారం కొన్ని కొన్ని విషయాల్లో నా స్వంత అభిప్రాయాలు వెల్లడిస్తూ వుండేవాణ్ణి. మా ఆవిడ ఎంతో నేర్పుగా, చాకచక్యంగా నన్ను తన దోవకు తిప్పుకుంది.

నా స్నేహితుడొకతను వుండేవాడు.

వాడికి మమ్మల్ని చూస్తే ఈర్ష్యగా వుండేది.

"అబ్బ! మిమ్మల్ని చూస్తే ముచ్చటగా వుంటుందిరా. ఇద్దరూ ఒక్కమాటగా వుంటారు. ఆ వుపాయమేదో నాకూ చెప్పరాదూ?" అంటాడు అసూయగా చూస్తూ.

పైగా అంటాడు నిట్టూరుస్తూ,

"మమ్మల్ని చూడు. ఒక్క విషయంలో కలవదు. ప్రతిరోజూ ఇంట్లో ఒక ప్రచ్ఛన్నయుద్ధం జరగవలసిందే!"

"ఆహా.... ఎంత అదృష్టవంతుడు. నిజమైన అనుకూల దాంపత్యమంటే అదేనోయి పిచ్చివాడా...." అనుకున్నాను.

....నా కిప్పుడు యాభై య్యేళ్ళు పైచిలుకే వుండవచ్చు. పెళ్ళయిన దగ్గర్నుంచీ ఆవిడమీద ఆధారపడి వుండటం అలవాటు పడి వున్నానేమో, స్వతంత్రంగా ఆలోచించటం మర్చిపోయాను. నా కూతురు పెళ్ళీడుకు వచ్చేవరకూ ఇంట్లో తండ్రిగా నా బాధ్యత ఏమిటో నాకు తెలిసిరాలేదు.

మొదటిసారిగా మా పెద్దమ్మాయి పెళ్ళి విషయంలో ఆవిడతో ఘర్షణ పడక తప్పలేదు....

ముప్ఫయి యేళ్ళుగా ఆవిడ మాట వేదవాక్కులా భావిస్తూ, ఆవిడ నీడగా బ్రతికానే, ఈ ఒక్క విషయంలో నా మాటకి విలువ నివ్వకపోవటం నాకు

చాలా అమానుషంగా తోచింది.

ఆడదాన్ని ముందునించే ఎందుకు అదుపులో పెట్టుకుంటాడో మొదటిసారి గ్రహించాను. వాళ్ళని ఎప్పటికప్పుడు అణచివుంచకపోతే కొమ్ములొచ్చి మనల్నే పొడవటానికి తయారవుతారు

మా తాతయ్య నా చిన్నప్పుడనేవాడు. ఆడదాన్ని చెప్పుకింద తేలులా వుంచాలి గానీ మన నరనన చోటిచ్చామా మనకే ఎసరుపెడుతుంది. అనేవాడు....

ఇంట్లో ఇప్పుడు భయంకర నిశ్శబ్దం రాజ్యమేలుతోంది.

మా అవిడకీ, నాకూ మాటల్లేవు.

అన్నం వడ్డిస్తూ అమ్మ జంకుతూ అంది.

"అది ఉసూరుమంటోంది. పోనీ దానిష్టప్రకారమే...."

సర్రున చూశాను.

"ఏవిటమ్మా దానిష్టం? భూము లున్నాయిగదాని అక్షరమ్ముక్క లేని వాడికి పిల్లనిస్తామా? ఒక్క పైసా సంపాదన లేనివాడు రేపు పిల్ల రవిక గుడ్డ కొనమన్నా 'అబ్బ' నడుగుతాడా?"

అమ్మ ఏం మాట్లాడలేదు.

మా ఆవిడ పడక గదిలోంచి తారాజువ్వలా దూసుకొచ్చింది.

"ఓయబ్బ! సంపాదన. పెళ్ళినాటికి మీరే సంపాదిస్తున్నారని మా నాన్న మీకు కట్టబెట్టాడూ? అయ్యా పెన్షన్ డబ్బులు తప్పితే మనకి పైసా రికాణా లేదు...." ఎత్తిపొడుపుగా అంది.

అబ్బ! ఈ ఆడవాళ్ళు ఎంత వికృతంగా మాట్లాడగలరు?

నిజమే! పెళ్ళినాటికి నా కింకా ఉద్యోగం రాలేదు. అయితేయేం? లంకంత కొంప, ఒక్కడే కొడుకుని.... నాకున్న చదువుకి ఇవ్వాళ కాకపోయినా రేపయినా గొప్ప ఉద్యోగం వెతుక్కుంటూ వస్తుందని గ్రహించిన వాడిలా మామగారు కాళ్ళు కడిగి కన్యాదానం చేశారు. పెళ్ళయిన మరునటి నెలలోనే ఆర్డర్స్ అందుకున్నాను. అంతా కోడలొచ్చిన వేళావిశేషం అన్నారు. నే నివ్వాళ మా ఆవిడకింత అసమర్ధుడినై పోయాను.

"నే నీ విషయంలో మాత్రం నీ మాట వినను వినను. అది నా కూతురు. తల్లిగా నీకెంత బాధ్యతవుందో దాని బాగోగులు చూడాల్సిన అవసరం నా కంతకన్నా ఎక్కువగానే వుంది. నువ్వెంత గొంతు చించుకున్నా ఆ కలెక్టరుగారి సంబంధం చెయ్యనుగాక చెయ్యను...." విసురుగా కంచం ముందునుండి లేచి అంతకన్నా వేగంగా గడపదాటాను.

వెనకాల ఆవిడ నిప్పులు కక్కుతున్న కళ్ళతో నావేపు చూస్తుంటుందని నాకు తెలుసు.

....మా అమ్మాయిని రెండు సంబంధాలు వెతుక్కుంటూ వచ్చాయి చేసుకుంటామంటూ. ఒకటి వూళ్ళోదే! అంతగా కలిగిన కుటుంబం కాదు. పిల్లవాడు తెలిసిన కుర్రాడే. ఎమ్మే పాసయి లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. ఈ సంబంధము నా కన్నివిధాలా నచ్చింది. అమ్మా, నాన్నకూడా సంతోషంగా తలూపారు. ఇంకోటి కలెక్టరుగారి సంబంధం. తండ్రి కలెక్టరయినాడు గానీ కుర్రవాడికి కనీసం కండక్టరయే యోగ్యతయినా లేదు. తను చిన్నప్పుడే చదువు మానేసి ఇంటిపట్టున వుండి వ్యవసాయం నేర్చుకుంటున్నాడు తాతగారి వూళ్ళో. మా అమ్మాయి ఆ పల్లెటూరు వెళ్ళి అతనితోపాటు పేడ పిసుకుతూ కూర్చోవాలని మా ఆవిడ వుద్దేశం. నా కంఠంలో ప్రాణంవుండగా ఇందుకు ఒప్పుకోను.... మా ఆవిడా అదే మాట అంది. "ఆ బడిపంతులికి నా బిడ్డ నిచ్చే రంటే నూతిలో దూకుతా" నంది.

నెలకి పదిహేనువందలు తెచ్చుకుంటున్న లెక్చరరుకి మా ఆవిడ దృష్టిలో వున్న విలువ అది.

చిన్నప్పుడు "మన బాబుని ఫలానా స్కూల్లో చేర్పిద్దామండీ...."

"సరే...."

అమ్మాయి సైకిల్ నేర్చుకుంటా నంటోంది...."

"ఓకే...."

"మీరు ఇప్పట్నుంచీ పంచెలుకట్టడం ఏమిటి? మీకన్నా పెద్దవారు మా నాన్నే ప్యాంటు, షర్టు వేసుకుంటారు. మీరూ అలాగే చెయ్యండి...."

పంచెలన్నీ చుట్టచుట్టి పెట్టె అడుక్కి తోసేశాను.

అట్లాగే....

మనమ్మాయికి ఫలాని వరుణ్ణిచ్చి చేద్దామంటే సరేనన్లేక పోతున్నాను.

చిన్నప్పుడు సైకిల్ కొనివ్వటం, పెద్దయినాక వరుణ్ణి కొనివ్వడం ఒకటి కాదని నా వుద్దేశ మనుకుంటా.

చెప్పినమాట వినే మొగుడుగానే అలవాటుపడ్డ నా భార్య, పాపం.... కొత్తగా నాలో బయల్దేరిన ఈ విరోధానికి తట్టుకోలేకుండా వుంది. నాలో ఇంత మొండితనం వుందని నాకే తెలీదు..... చెప్పిన మాట వినే మొగాళ్ళ వంశంలో పుట్టింది మా ఆవిడ. మా మామగారు మా అత్తగారి మాటకు ఎదురుచెప్పరని నాకు తెలుసు. మా ఆవిడకి ఒక అక్కా, బావ వున్నారు ఆవిడ పెళ్ళయిన మరుసటి నెలలో ఒకే వూళ్ళో వేరు కాపరం పెట్టించిన [illegible]. మా శ్రీమతికి ఒక అన్నయ్య వున్నాడు. భార్య కోరిక ప్రకారం విశేషంలాంటి వుద్యోగం మానుకుని మామగారి వ్యాపారంలో భాగంతీసుకుని అత్తగారింట్లోనే నివాసం ఏర్పరచుకున్న ధీశాలి...... ఇలాంటి కుటుంబంనుండి వచ్చింది మా ఆవిడ..... నేను చూసిన సంసారాలు చాలా తక్కువ. మా అమ్మనీ, నాన్ననీ చూశాను. మా అమ్మ మా నాన్నగారి మాటకు ఎదురుచెప్పదు. వారు ఆదర్శ దంపతులుగా చెలామణీ అవుతున్నారు.

నాకు ఒకతే తోబుట్టువు. మా అక్కయ్య పెళ్ళయిన కొత్తలో అందరూ చెప్పుకుంటుండేవారు. "ఆ సంసారం ఎంత చూడముచ్చటగా వుంది. భార్యాభర్తలిద్దరూ పాలూ, నీళ్ళలా కలిసిపోయారు" అని. నేను కొంచెం పెద్దవాడినయాక అక్కయ్య దాంపత్యంలోని రహస్యం అర్థమైపోయింది. అక్కయ్య తను ఒక మనిషినని మర్చిపోయింది. తన ఆశలూ, ఆశయాలూ జీవితంమీది కాంక్ష అన్నీ పెళ్ళయిన కొద్దిరోజుల్లోనే మూటగట్టి కనుచూపు మేరలో కనబడకుండా దూరంగా గిరాటేసింది. అది బ్రతుకుతూనే వుంది భర్తకి అనుకూలంగా। ముప్ఫయి యేళ్ళకే జీవితంమీద విసుగు, నిర్లక్ష్యం, బ్రతుకుపట్ల నైరాశ్యం, కోరికలు చంపుకున్న వైరాగ్యం ఒక్కమాటలో చెప్పాలంటే ఆమెలోని సారాన్ని పీల్చేసి పిప్పిని మిగిల్చాడు మా బావ.... ఇదండీ, వాళ్ళ ఆదర్శ అన్యోన్య దాంపత్యం .... పిట్టపోరూ, పిట్టపోరూ పిల్లి తీర్చినట్టు మా సమస్యకి పరిష్కారం మా అమ్మాయే చూపింది....

ఆఫీసు పనిమీద మద్రాసు వెళ్ళాల్సి వచ్చింది. వెళ్ళినపని అయిపోయింది గానీ స్నేహితుల బలవంతంమీద మహాబలిపురం చూద్దామని మరో రెండు రోజులు ప్రయాణం వాయిదా వేశాను.

హోటల్‌కి రాగానే మేనేజర్ పిలిచి, "మీకు టెలిగ్రాం వచ్చింది" అంటూ అందించాడు.

నేను గాభరాగా తీసి చూశాను.

వృద్ధాప్యంలో వున్న అమ్మా, నాన్నా మనసులో మెదిలారు. అర్జంటుగా రమ్మని మా ఆవిడ ఇచ్చింది టెలిగ్రాం.

ఎందుకో ఎంత ఆలోచించినా అర్థం గాలేదు.

అమ్మకిగానీ, నాన్నకిగానీ సుస్తీగా వుంటే ఆ విషయం అందులో వుండేది. పోనీ మా ఆవిడకేదైనా జబ్బుచేసిందా అంటే శుభ్రంగా తిని తిరుగుతూ రాయిలా వున్న ఆవిడకి జబ్బు చేసిందంటే నమ్మ శక్యం గావటంలేదు.

వెంటనే బయల్దేరాను.

ఇంటికి వచ్చీరాగానే షాక్ తగిలింది.

ఇలాంటి వార్త వినవలసి వస్తుందని నేను కల్లోకూడా అనుకోలేదు .... మా ఆవిడ ఇంటినుండి శవం వెళ్ళినట్టు శోకాలు పెడుతూంది.

అమ్మ చాటుగా పిల్చి అంతా వివరించింది.

మా అమ్మాయి ధైర్యానికి నిర్ఘాంతపోయాను. దాని సాహసానికి సంతోషం కూడా కలిగింది.


మా ఆవిడ పెట్టే శాపనార్థాలు విన్పించుకోకుండా బయటకు నడిచాను.

అడ్రస్ కనుక్కోవటం కష్టంగాలేదు.

తలుపు తీస్తూనే తప్పుచేసినదానిలా తలవంచుకు నిలబడింది నా చిట్టితల్లి.

మెడలో పసుపుతాడుకు వ్రేలాడు





తున్న మంగళసూత్రాలు, కంఠాన్ని అంటిపెట్టుకుని వున్న నల్లపూసలు....

ఆనందంతో కొద్దిసేపు నాకు నోట మాటరాలేదు.

కళ్ళు మూసుకున్నాను తన్మయత్వంతో....

కళ్ళు తెరిచేసరికి అల్లుడు, కూతురూ నా పాదాలమీదికి వంగుతున్నారు.

చటుక్కున లేవదీశాను.


"మమ్మల్ని క్షమించండి నాన్నా.... అమ్మకీ, మీకూ ఏమాత్రం ఇష్టం వుండదని తెలిసికూడా ధైర్యం చేశాను .... ఆయన మన కులంగాదు. కానీ నేనంటే ప్రాణం ఇచ్చే వ్యక్తి. మీరు మాత్రం ఇంతకన్నా ఇంకేం కోరుకుంటారు నాన్నా...." అంది కన్నీళ్ళతో.

దగ్గరగా తీసుకున్నాను.

"నాకు చాలా సంతోషంగా వుంది తల్లీ....పాతికేళ్ళుగా నేను చేయలేని పని ఒక్క రోజులో నీవు చేయగలిగావు....ఇప్పుడు నేను నిజమైన తండ్రి ననిపించుకున్నాను .... పదికాలాలపాటు అన్యోన్యంగా, అనుకూలంగా...."

ఆగిపోయాను. తన్మయంగా దీవిస్తున్నాను. నా అల్లుడు కూడా నాలాగే.... ఊహూఁ....

"పది కాలాలపాటు సుఖంగా జీవించండి...."




# యుద్ధం



## కోటికొండ సత్యానంద

అతను నడుస్తున్నాడు....

నీరసంగా, నిస్సత్తువగా.... బాధగా, భారంగా నడుస్తున్నాడు....

ఎండ మండిపోతుంది అతని కడుపులో ఆకలిలా....

చెమట కారిపోతుంది ధారలా....

దాహం వేస్తుంది .... నాలుక పిడచ కట్టుకుపోయింది....

ఆలోచనలు ఆగకుండా పరుగెడుతున్న మెదడు పగిలిపోతున్నట్లుగా ఉంది....

అతను చదువుకున్న సంస్కారవంతుడు....అందుకే పీకలదాకా మునిగిపోయినా ఇంకా ఆలోచిస్తున్నాడు....

అతను దిక్కుమాలిన మధ్య తరగతి కుటుంబీకుడు .... అందుకే అభిమాన పడుతున్నాడు....

అతను నడవలేక పోతున్నాడు .... అయినా నడుస్తున్నాడు .... అందుకే ఆయాసపడుతున్నాడు....

అతను మామూలుగా లేడు .... పిచ్చివాడిలా ఉన్నాడు....పిత్తుగా ఓడిపోయిన వాడిలా ఉన్నాడు....

చదువు, వయసు ఉన్న అతను అమ్ముడవ్వలేకపోతున్నాడు .... కారణం అతనికి అభిమానం ఉంది....

వయసంటే గుర్తొచ్చింది .... అతని వయసు అతన్ని కొన్ని ఉద్యోగాలకు కనీసం అప్లికేషన్ పెట్టడానికి కూడా వీలులేనంతగా పెరిగిపోయింది....

పిచ్చి మధ్యతరగతి మనిషి కావడాన అభిమానాన్ని చంపుకోలేక పోతున్నాడు....చదువుతోపాటు సంస్కారాన్ని పెంచుకోవడం వల్ల ఆదర్శాల్ని విడువలేకపోతున్నాడు....

అతని చేతిలో నలిగిపోయిన ఫైలుంది .... అందులో చిరిగిపోతున్న సర్టిఫికేట్లున్నాయి....

ఫైల్లో సర్టిఫికేట్లు .... అవి అతని గొప్పతనానికి నిదర్శనాలు .... అతని తెలివితేటలకు తార్కాణాలు .... వాటి స్థితిగతులు మాత్రం అతని చేతగానితనాన్ని అస్పష్టంగా చూపించే పగిలిపోయిన అద్దం ముక్కలు .... అతని ఓటమికి అందమైన ప్రతిబింబాలు....

అతని కడుపులో ప్రేవులు ఆనంద